స్కెచ్

# రైల్లో ఇంద్రజాలం

'జయంతి'

"సిగరెట్టొకటి ఇస్తారా, సేటుగారూ!"

"నేను కాల్చనండీ"

"పోనీ పాన్ ఒకటి"

"సరే ఇదిగో"

సేట్ రామానందం మనుష్యుల్ని పరీక్ష చెయ్యడంలో ఆరితేరిన చెయ్యి. ఏ మనస్తత్వమైనా, ఘటికలో పసికట్టేస్తాడు. ఇందాకా ఢిల్లీ స్టేషన్లో తన చేతిలోని నోట్లకేసి పరకాయించిన వ్యక్తే తనతో ఫస్టుక్లాసులో ప్రయాణం చేస్తున్నాడు. మూడోవాళ్లెవరూ లేరా పెట్టెలో. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా జేబు ఖాళీ అయి వూరుకుంటుంది. అయితేనేం, తన కల్లాంటి భయాలుంటేనా!

'కొంచెం సుపారీ పెడతారా"

"ఇదిగో తీసుకోండి - మీ రెంత వరకూ పోతూన్నారు?'

"బెజవాడ"

"తమ నామధేయం"

"సహస్రబుద్ధి"

సేటుకూడా వెళ్లేది బెజవాడే. రెండు రాత్రులు కాచుకోవాలి. రైలు శరవేగంతో పోతూంది. సహస్రబుద్ధి 'బయటకు చూస్తున్నాడు. నీరెండలు ప్రకృతిమీద వింతగా మెరుస్తున్నాయి. తన కళ్ళముందే సేటు వెయ్యి వరకూ నోట్లుమడిచి జేబులో పెట్టుకున్నాడు. చీకటి పడడమే తడవు తన జేబు నిండుతుంది. దారిలోనే దిగిపోవచ్చు. తనకున్న అప్పులన్నీ తీర్చుకుని ఈ పాడువ్యాపారానికి స్వస్తి చెప్పవచ్చు. ఈ భావతరంగాలలో ఉన్మత్తుడై మెల్లగా పాటలు మొదలుపెట్టేడు.

రైలు మధుర సమీపించింది. "యమునా మాయీకీ జై" అంటూ సన్యాసులు బయట గోల చేస్తున్నారు. స్టేషన్లో ఆగడమే తడవు సహస్రబుద్ధి "బాబూ నా సామాను కొంచెం చూస్తూండండి" అని ప్లాట్ ఫారం మీదకు దిగి వెళ్లేడు. సేటు రెండో పక్క వున్న అతని పరుపు మీద కూర్చుని బయటకు తొంగి చూస్తున్నాడు. జనసమ్మర్దం ఎక్కువగా వుంది. యాత్రకై వచ్చిన వారు తిరుగుముఖం పెట్టినా రైల్లో దూరడానికి తలక్రిందులు పడుతున్నారు. గార్డు ఈలవేశాడు. సహస్రబుద్ధి లోపలికొచ్చి 'ఇదిగో, మీకు బిస్కట్లు' అన్నాడు.

'ఎందుకండీ, ఇవన్నీ' అంటూ సేటు తన పక్క మీదికి జరిగేడు. సహస్రబుద్ధి పుస్తకం చదువుతూ పడుకున్నాడు. సేటు కూడా మేను వాల్చాడు. కోటు హేంగరుకు తగిలించి వుంది. సహస్రబుద్ధి దృష్టి పుస్తకం మీద వున్నా ధ్యానం ఆ కోటుమీదే వుంది. అలాగే నిమిషాలు, గంటలు గడచిపోతున్నాయి. రైలు ఆగ్రా, గ్వాలియరు దాటింది. సేటు గుర్రు పెడుతున్నాడు. సహస్రబుద్ధి లేచాడు. ఆ కోటు తీసి బాత్ రూమ్ లోకి దుమికేడు. సేట్ లేచి, చుట్టూ చూసుకుని పడుకున్నాడు. పదినిమిషాల తర్వాత సహస్రబుద్ధి ఇవతలికి వచ్చి, కోటు తగిలించి, పడుకున్నాడు. అతని మనస్సు విప్పారినట్లు కనిపించదు. అతని నుదుటిమడతలమీద విషాదచ్ఛాయలు ప్రస్ఫుటమవుతున్నాయి. తీరని త్రాస అతన్ని వేధిస్తోంది. నోట్లు దొరకలేదు కాబోలు!

"తప్పకుండా మొలలో దాచుకుని వుంటాడు లేదా పరుపులో పెట్టుకోవాలి. ఎలాగైనా సరే అవి నాచేత పడితీరాలి!"

ఝాన్సీస్టేషను. రామానందం లేచి, పంచ సర్దుకొని "ఇప్పుడే వస్తాను. కొంచెం చూస్తుండండి" అంటూ దిగేడు.

సహస్రబుద్ధికి అదృష్టం పండినట్లయింది. వెంటనే లేచి పరుపుగలేబులు, హోల్డాల్ అంతా పరిశోధన సాగించేడు. కాని అతని ఆశ నిరాశ అయింది.

సేటు లోపలికొచ్చాడు. సహస్రబుద్ధి ఆలోచిస్తున్నాడు. "పంచ సర్దుకోడం తాను చూశాడు. ఏమీ కనపడలేదు. సేటు మంత్రవేత్త కాదు కదా!" రైలు కదిలింది. సేటు సుఖంగా నిద్రపోతున్నాడు. సహస్రబుద్ధికి నిద్ర రావడంలేదు. చేతబడ్డ పెన్నిధి మాయమయినట్లు, చేతి కందిన పండు ఎవరో ఎత్తుకుపోయినట్లు బాధపడుతున్నాడు. మార్గాంతరాలు ఆలోచిస్తున్నాడు అన్వేషణకి. రాత్రి నిద్ర చెడిన తర్వాత అతనికి తోచింది-సూట్‌కేసులో పెట్టివుంటాడని. ఇంతలో భోపాల్ వచ్చింది. యథాప్రకారం సహస్రబుద్ధి ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తున్నాడు. సేటు బయటకు తొంగి చూస్తున్నాడు.

సహస్రబుద్ధి లోపలికి రావడమే తడవు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. సేటు మళ్లీ నోట్లు లెక్కపెట్టుకుంటున్నాడు.

"ఈరాత్రి సర్వం గాలిస్తాను. ఇంక తప్పించుకోలేడు" అంటూ దినమంతా ఆనందంగా గడిపాడు. ఎప్పుడు రాత్రి వస్తుందా అని ఆత్రుత. ఒకే ఆత్రుత.

సాయంత్ర మయింది. రైలు వార్ధా దాటింది. ఇద్దరూ భోజనం చేసి పడుకున్నారు. సేటు మొలలోని తాళంచెవులు కింద పడివున్నాయి. సహస్రబుద్ధి కళ్లు వాటిమీదే వున్నాయి. సేటు నిద్రపోవడంలేదు. వేదాంతపు పాటలేవో పాడుకుంటున్నాడు. రైలు బాలార్షా దాటింది. సేటు బాత్ రూమ్ లోపలి కెళ్ళాడు. వెంటనే లేచి సహస్రబుద్ధి పెట్టె తెరచాడు. అరగంటదాకా సేటు వెలుపలికి రాకపోవడంవల్ల సహస్రబుద్ధి అన్నిబట్టలూ దులిపి దులిపి చూశాడు. మళ్లీ పరుపు గాలించాడు. కోటుజేబులో వెదికాడు. ఏమీ దొరక్క హతాశు డైపోయాడు. సేటు వచ్చాడు. ఎప్పటిలాగ నిశ్చింతగా పడుకున్నాడు. కాజీపేట దాటింది.

సహస్రబుద్ధికి మతి చెడింది. 'సేటు నిజంగా మంత్రగాడే!' ఏమీతోచక వెర్రిగా బయటకు చూస్తున్నాడు. తనమీద తనకే జాలి వేస్తూంది. వేగుచుక్క వెలవెలబారుతోంది. చీకట్లు క్రమంగా మాయ మవుతున్నాయి. ప్రకృతితో బాటు అతని హృదయానికీ పరివర్తన కలుగుతూన్నట్లుంది. కాకులు అరుస్తూ ఎగురుతున్నాయి అతని మనస్సులాగే. రైలు తన దారిని తాను పోతూంది వెనకచూపు లేకుండా. తెల్లవారింది. స్త్రీలు పక్కనున్న రోడ్డుమీద పాలముంతలు మోసుకుపోతున్నారు. పైమీద బట్టలేనా లేకుండా కూలీలు పనిలోకి వెళ్తున్నారు. జొన్నచేలలో ఎడ్లు తమ స్వాముల భూములు దున్నిపెడుతున్నాయి. పక్కనున్న కాఫీహోటల్‌లో జనం మూగుతున్నారు. ఒక సాతాని పాడుకుంటూ పదిమందికి వినోదం కల్పిస్తున్నాడు. సహస్రబుద్ధి ఆలోచిస్తున్నాడు. ఇవన్నీ భుక్తికి మార్గాలు. భారమైపోతూన్న బ్రతుకులో వాళ్లు సహనశక్తి అలవరచుకున్నారు. కష్టపడకుండా ధనం రావాలని వాళ్లెవరూ ఆశించరు. తానూ వాళ్ళలాగ ఎందుకు పాటుపడకూడదు? ఈ సూర్యోదయంతో పాటు తనకు జ్ఞానోదయ మయిందా?

బెజవాడ మైలు దూరంలో వుంది. సేటు పరుపుచుట్టి నోట్లు లెక్కపెట్టుకుంటున్నాడు. సహస్రబుద్ధికి సందేహనివారణ అయింది. సేటు తప్పక మంత్రగాడే! కురిసి వెలిసిన వానలాగ ప్రయాణం పూర్తి అయింది. ఇద్దరూ దిగి ఎవరి దారి వారు పట్టేరు. స్టేషన్ బయట సేటు తనకారులో ఎక్కుతూంటే సహస్రబుద్ధి పరుగెత్తుకు వచ్చేడు.

"సేటుగారూ! ఒక్కమాట అడుగుతాను. ఏమీ అనుకోకుండా సమాధానం చెబుతారా?"

"దానికేం బాబూ, అడుగు. నాకు తెలుసులే నువ్వేం అడుగుతావో- ఆనోట్ల సంగతి..."

"చిత్తం"

సేటు మెల్లిగా నవ్వాడు. అది భావశూన్యమైన వెకిలినవ్వు కాదు. అర్థసహితమైన చిరునవ్వు.

"ఆ నోట్లు సాయంత్రం నీ హోల్డాల్ మడతలలో దాచి ఉదయం నువ్వు బాత్ రూముకు వెళ్ళినప్పుడు తీసికొనేవాడిని. నాకు తెలుసు. నీ హోల్డాల్‌లో నువ్వెలాగా చూడవని."
సహస్రబుద్ధికి మీద పిడుగు పడినట్లుంది.